క్లుప్తంగా

మురుగు తొలగించారు



సాక్షి ఎఫెక్ట్..

కోటపల్లి: మండలంలోని సర్వాయిపేట సేవా లాల్ కాలనీలో మురుగునీరు నిల్వ ఉండి ప్రజలు ఇబ్బంది పడుతుండగా 'దుర్వాసనతో అవస్థలు' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. ఎంపీవో అక్తర్ ఆదేశాలతో కార్యదర్శి రమేశ్ డ్రెయినేజీలో మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టారు. సిబ్బందితో మురుగు తొలగింపజేశారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి'కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

'అర్హుల జాబితాపై అభ్యంతరాలు తెలుపండి'

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 286 డబుల్ బెడ్ రూం ఇళ్లకు గాను 228మంది అర్హులను గుర్తించినట్లు మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో 285మంది అర్హుల జాబితాను మున్సిపల్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ఉంచితే 76ఫిర్యాదులు వచ్చాయని వాటిని పునఃపరిశీలన చేసిన తర్వాత మొత్తం 228మందిని డబుల్ బెడ్ రూం ఇళ్లకు అర్హులుగా, 57మందిని అనర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అర్హులు, అనర్హుల జాబితాను ప్రచురించిన తర్వాత మూడు రోజుల లోపు మరోసారి అభ్యంతరాలను మందమర్రి తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

లక్సెట్టిపేట: పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై సురేష్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. మండలంలోని తిమ్మాపూర్ గ్రామ శివారులోని రహస్య ప్రదేశంలో గ్రామానికి చెందిన చుంచు రత్నాకర్, దుర్గం భీమలింగు, అవునూరి శంకరయ్య, కాంద్రపు తిరుపతి అనే నలుగురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడి చేశామన్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు, తిరుపతి పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1860స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కానిస్టేబళ్లు సత్యనారాయణ, ప్రేంకుమార్ ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: మున్సిపాలిటీ పరిధిలోని అంబేడ్కర్ రడగంబాల బస్తీ శివారులో పేకాడుతున్నట్లు సమాచారం వచ్చినట్లు టూటౌన్ ఎస్సై మహేందర్ తెలిపారు. పేకాట శిబిరంపై దాడి చేయగా నలుగురు జూదరులు పట్టుబడినట్లు, ఒకరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3050, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసి నలుగురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ రవీందర్, సిబ్బంది శేఖర్, సంపత్ పాల్గొన్నారు.

'నిధుల దుబారా ఆపాలి'

శ్రీరాంపూర్: సింగరేణిలో నిధుల దుబారా ఆపాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, నాయకులు రమేశ్, సత్తయ్యలు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక బాధ్యత పేరుతో ఉస్మానియా యూనివర్సిటీకి డిజిటల్ క్లాస్ రూం, సామగ్రికి కంపెనీ నిధులు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే ఈ నిధుల తరలింపు ఆపాలని డిమాండ్ చేశారు. కంపెనీ 2024–25ఆర్థిక సంవత్సరంలో కంపెనీ సాధించిన లాభాలు వెంటనే ప్రకటించాలన్నారు.

క్రీడాకారులను సన్మానించాలి

శ్రీరాంపూర్: తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో సింగరేణి క్రీడాకారులను కంపెనీ అధికారికంగా సన్మానించాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని కోరారు. 2024–25 సంవత్సరానికి గాను జాతీయ స్థాయి కోలిండియా పోటీల్లో ప్రతిభ కనబరిచిన 11ఏరియాకు చెందిన 58మంది క్రీడాకారులను సన్మానించాలన్నారు. దీని ద్వారా వారిని మరింత ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. ఆవిర్భావ వేడుకల్లో ఉత్తమ కార్మికుల సన్మాన సమయంలో వీరిని కూడా అదే వేదికపై సన్మానం చేయాలన్నారు.

ఘనంగా అహల్యబాయి జయంతి

చెన్నూర్: చెన్నూర్ శివాలయం, జగన్నాథాలయాల్లో అహల్యబాయి హోల్కర్ జయంతి వేడుకలను బీజేపీ మంచిర్యాల జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు జోగుల శ్రీదేవి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో అహల్యబాయి పేరున ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయాల అర్చకులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా అహల్యబాయ్ 60దేవాలయాల నిర్మాణంతో పాటు ప్రజాసంక్షేమం, ధర్మ పరిరక్షణ కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, నాయకులు జాడి తిరుపతి, గర్రెపల్లి నర్సయ్య, కేవీఎం శ్రీనివాస్, ఏతం శివకృష్ణ, రత్న లక్ష్మీనారాయణ, లావణ్య పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలు.. ప్రజల అవస్థలు



జనగామ పాఠశాల ఎదుట నిలిచిన మురుగునీరు



బెల్లంపల్లి: అంబేడ్కర్‌నగర్ నుంచి ఇందిరానగర్ వెళ్లే రోడ్డులో..



మేదరిపేట నుంచి మామిడిపల్లి వెళ్లే రోడ్డు పై గుంతలో నీళ్లు

సాక్షి ఫోటోస్

బెల్లంపల్లి/కాసిపేట/దండేపల్లి/కోటపల్లి/వేమనపల్లి : అంతర్గత రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ప్రస్తుతం కురుస్తున్న అకాల వర్షాలతో రోడ్లపై, గుంతల్లో వరదనీరు నిలిచి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాసిపేట మండలంలోని కొండాపూర్ యాపలో, దండేపల్లి మండలంలోని మేదరిపేటలో, బెల్లంపల్లి పాతబస్టాండ్ వద్ద నుంచి ఇంద్రానగర్‌కు వెళ్లే ప్రధాన అంతర్గత రోడ్డు, కోటపల్లి మండలంలోని జనగామ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట రోడ్లు నీరు నిలిచి బురదమయంగా మారాయి. వేమనపల్లి మండలం నీల్వాయిలో పాత రోడ్డును తొలగించి కొత్త రోడ్డు నిర్మాణ పనుల కోసం రోడ్డును తవ్వారు. పక్కనే ఎర్రమట్టి పోశారు. కాంట్రాక్టర్ పనులు చేయడంలో నిర్లక్ష్యం చేస్తుండటంతో వర్షం కురిసినప్పుడల్లా రోడ్లపై బురదగా మారుతోంది. దోమలకు, ఈగలు వ్యాప్తిచెందుతున్నాయని, దుర్గంధం వెదజల్లుతోందని ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే గుంతలు పూడ్చి ఇక్కట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



నీల్వాయి గ్రామంలో ఎర్రమట్టితో ఉన్న జారుడు రోడ్డు



కొండపూర్ యాపలో నీటితో నిండిన గుంతలతో ప్రధాన రోడ్డు

పల్లెల అభివృద్ధే ధ్యేయం

• చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్

జైపూర్: పల్లెల్లో రవాణా వ్యవస్థ మెరుగుపడటం ద్వారా అన్నిరకాలుగా అభివృద్ధి సాధిస్తాయని, పల్లెల అభివృద్ధే ధ్యేయం అని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ తెలిపారు. మండలంలోని మంచిర్యాల-చెన్నూర్ 63వ నంబర్ జాతీయ రహదారి నర్వ-మిట్టపల్లి నర్వగ్రామం మీదుగా బీటీ రోడ్డు సీఆర్ఆర్ ద్వారా రూ.2కోట్లతో నిర్మించనున్న కొత్త రోడ్డు నిర్మాణ పనులకు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు, కాంగ్రెస్ పార్టీ డీసీసీ జనరల్ సెక్రెటరీ రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫయాజ్, గోదారి విజయ్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వివేక్

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

మందమర్రిరూరల్: సింగరేణి డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ ఆధ్వర్యంలో గత నెల రోజులుగా వివిధ క్రీడల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు భవిష్యత్ కాలంలో సద్వినియోగం చేసుకోవాలని మందమర్రి ఏరియా జీఎం దేవేందర్ సూచించారు. స్థానిక సీఈఆర్‌క్లబ్ ఆవరణలో సోమవారం నిర్వహించిన శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జీఎం హాజరై మాట్లాడారు. సింగరేణి సంస్థ సీఎండీ బలరాం ఆదేశాల మేరకు శిక్షణ శిబిరాలు నిర్వహించి, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో నేర్చుకున్న మెలకువలతో క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. శిక్షణ తీసుకున్న 160మంది క్రీడాకారులకు డ్రెస్ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, డబ్ల్యూపీఎస్ అండ్ హానరరీ సెక్రెటరీ కార్తీక్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు రమేశ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివ, గ్రౌండ్ ఇన్‌చార్జి నస్పూరి తిరుపతి, కోచ్‌లు పాల్గొన్నారు.



విద్యార్థులతో జీఎం దేవేందర్

బీజేపీ ఆధ్వర్యంలో తిరంగార్యాలీ

మందమర్రిరూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా భారత సైనికులకు మద్దతుగా సోమవారం పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. సింగరేణి హైస్కూల్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహం నుంచి మార్కెట్ మీదుగా ఈ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు సప్పిడి నరేష్, నాయకులు దుర్గం అశోక్, డీవీ దీక్షితులు, శ్రీనివాస్, మోహన్ తదితరులు ఉన్నారు.

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లిలోని పాత బస్టాండ్ బీజేపీ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అమరాజుల శ్రీదేవి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్, బెల్లంపల్లి అసెంబ్లీ కన్వీనర్ రాచర్ల సంతోష్, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

జైపూర్: మండలంలోని ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టులో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గని మేనేజర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే.బాజీసైదా, నాయకులు రాచందర్, బుచ్చన్న, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపుపై విచారణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుబ్బరాంపల్లి గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఇతర ప్రాంతాల నుంచి తక్కువ ధరకు ధాన్యం తెచ్చి అమ్ముతున్నారని వచ్చిన ఆరోపణలపై డీసీవో మోహన్ సోమవారం విచారణ చేపట్టారు. ఇతర ప్రాంతాల నుంచి కేంద్రానికి ధాన్యం రాలేదని రైతులు తెలిపినట్లు అధికారులు పేర్కొన్నారు. వారివెంట ఏడీఏ భానోత్ ప్రసాద్, ఏవో యామిని, సీఈవో లక్ష్మణ్‌రెడ్డి ఉన్నారు.

షూటింగ్‌లో పోలీస్ అధికారి కూతురు ప్రతిభ



సీపీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న క్రీడాకారిణి

మంచిర్యాలక్రైం: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్థాయిలో నిర్వహించిన షూటింగ్ పోటీల్లో ఏసీపీ సారంగపాణి కూతురు మేఘన ప్రతిభ కనబర్చి కాంస్య పతకం గెలుచుకుంది. రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా మేఘనను సోమవారం అభినందించారు. మేఘన విలువిద్యలోనూ జాతీయస్థాయి పోటీల్లో సత్తా చాటుతోంది.

అభివృద్ధి, అవినీతిపై చర్చకు సిద్ధమా?

• మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు సవాల్

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి పనులు స్పష్టంగా కనిపిస్తాయని, ప్రస్తుత ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు హయాంలో అవినీతి పెరిగిందని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతి, అభివృద్ధిపై చర్చకు సిద్ధమని, ఎమ్మెల్యే తేదీ, సమయం నిర్ణయించాలని సవాల్ విసిరారు. తాను గ్రామాలకు రోడ్లు, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, మాతా శిశు ఆసుపత్రి, రైల్వే అండర్‌బ్రిడ్జి, ఎల్లంపల్లి ప్రాజెక్టు వంటి అభి వృద్ధి పనులు చేసినట్లు దివాకర్‌రావు తెలిపారు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే గోదావరిపై బ్రిడ్జి నిర్మాణాన్ని రద్దు చేసి, కమీషన్ల కోసం ముల్కల్ల వద్ద నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. మార్కెట్ రోడ్డు విస్తరణ పేరిట రోడ్లను నాశనం చేశారని, టెండర్లు లేకుండా పనులు చేస్తున్నారని విమర్శించారు. భూధాన్ భూములను కాపాడి, నస్పూర్‌లో 3వేల మందికి ఇళ్ల పట్టాలు, రాజీవ్‌నగర్‌లో పేదలకు భూమి కేటాయించిన ఘనత తనదేనని ఆయన పేర్కొన్నారు. బీజేపీ నాయకుడు రఘునాథ్ ఆరోపణలను ఖండిస్తూ, ప్రజల మధ్య ఉంటూ తాము పనిచేస్తున్నామని, రఘునాథ్‌కు తమపై మాట్లాడే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్ రావు, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, బేర సత్యనారాయణ, ఎర్రం తిరుపతి, గోగుల రవీందర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

అథ్లెటిక్ పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాలలో ఈ నెల 25న నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో స్థానిక శ్రీ చైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–12 బాలికల విభాగంలో లాంగ్‌జంప్, 60మీటర్ల పరుగు పందెంలో అనుకీర్తన ప్రథమ స్థానం, అండర్–10బాలికల విభాగంలో జావలిన్ త్రోలో సహస్రి ద్వితీయ స్థానం, అండర్–8 బాలుర విభాగంలో జావలిన్ త్రో నిహాల్ ద్వితీయ స్థానం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థును పాఠశాల ప్రిన్సిపాల్ సంజీవ్, జోనల్ పీఈటీలు రాజేందర్, కుమారస్వామి, విలాస్, అక్షయ, అనూషలు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, పీఈటీలు

'ఎంపీ, ఎమ్మెల్యేలను విమర్శిస్తే ఊరుకోం'

మందమర్రిరూరల్: పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణను, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిని ఎవరు విమర్శించినా ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. పెద్దపెల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో వంశీకృష్ణ, చెన్నూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో వివేక్ వెంకటస్వామి ఎంతగానో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిని జీర్ణించుకోలేని ఐఎన్టీయూసీ నాయకులు కాంపెల్లి సమ్మయ్య వివేక్‌ను విమర్శించడం ఆయన అవివేకానికి నిదర్శనమన్నారు. మరోసారి ఎలాంటి విమర్శలు చేసినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సొతుకు సుదర్శన్, పుల్లూరి లక్ష్మణ్, సామ్యేల్, నర్సింగ్, శ్రీనివాస్, జమీల్, పాషా, రమేశ్, తిరుమల్ ఉన్నారు.

ఎమ్మెల్యేపై అసత్యపు ప్రచారాలు మానుకోవాలి

చెన్నూర్: నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామిపై అసత్యపు ప్రచారాలను మానుకోవాలని చెన్నూర్, కోటపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు తెలిపారు. స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. నీతి నిజాయితీకి మారుపేరైన ఎమ్మెల్యే పై తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ బెల్లంకొండ కరుణసాగర్‌రావు, చెన్న సూర్యనారాయణ, హిమవంతరెడ్డి, మహేశ్ ప్రసాద్, బాపగౌడ్, రామగిరి మల్లేశ్, చింతల శ్రీనివాస్, ఖలీల్, చెన్న వెంకటేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

• కమ్మ సేవా సమితి నూతన కార్యవర్గం

పాతమంచిర్యాల: జిల్లా కమ్మసేవా సమితి కార్యవర్గ సభ్యులను సోమవారం జిల్లా కేంద్రంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోలినేని వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా కరసాల ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శిగా మండల తాతారావు, కోశాధికారిగా గంగినేని జనార్దన్, ఉపాధ్యక్షులుగా ముక్కామల జగదీష్, సూరపనేని అర్జున్‌రావు, కార్యదర్శులుగా నెల్లూరి చంద్రశేఖర్, జగన్‌మోహన్‌రావు, కొల్లా వెంకటేశ్వర్‌రావు, కమిటీ సభ్యులుగా వలేటి సీతా రామయ్య, శ్రీనివాసరావు, సూరిబాబు, రాఘవేంద్ర, సుబ్రహ్మణ్యంలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమ్మ సేవా సమితి నాయకులు పాల్గొన్నారు.

• సీపీఐ పట్టణ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లిరూరల్: భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) బెల్లంపల్లి పట్టణ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. బెల్లంపల్లిలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పార్టీ పట్టణ కార్యదర్శిగా ఆడెపు రాజమొగిలి, సహాయ కార్యదర్శిగా బొల్లం తిలక్, కోశాధికారిగా మంతెన రమేశ్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి వెంకటస్వామి, బొల్లం పూర్ణిమ, సీనియర్ నాయకులు చిప్ప నర్సయ్య, బి.లక్ష్మీనారాయణ, బి.ఉపేందర్, రాంచందర్, శంకర్, రమేశ్, రాజేందర్ పాల్గొన్నారు.

• ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. బ్యాంకు సేవల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ శ్రీనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

• ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పంపిణీ

వేమనపల్లి: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో ఎంపీడీవో కుమారస్వామి, మాజీ జెడ్పీటీసీ సంతోష్ కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాబీర్‌ఆలీ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ డేవిడ్ భాస్కర్, నాయకులు ఒడిశ్ల రాజన్న, తోకల రాంచందర్, వెంకటేషం, గాలి మధు, లింగాగౌడ్, పురుషోత్తం, కిష్టయ్య, రమేష్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

• ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

భీమిని: మండలంలోని మల్లీడి గ్రామపంచాయతీలో సోమవారం ఇందిరమ్మ ఇళ్లకు ఎంపీడీవో గంగమోహన్ భూమిపూజ చేశారు. ప్రభుత్వం నుంచి అర్హులైన నిరుదపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భీమిని మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు గాదం లక్ష్మినారాయణ, మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్‌గౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లాగౌడ్, దశరథ్, నాయకులు పాల్గొన్నారు.

• పద్దనపల్లిలో విత్తనాల పంపిణీ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పద్దనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం రైతులకు పచ్చిరొట్ట, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ రామారావు, డైరెక్టర్ ధర్మరాజు, ఏటకృష్ణ, సీఈఓ వినయ్, రైతులు పాల్గొన్నారు. 173పచ్చిరొట్ట, జనుము విత్తన బ్యాగులు అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన రైతులు పట్టాపాసు పుస్తకంతో రైతువేదికలో ఆన్‌లైన్‌లో నమోదు చేసిన తర్వాత సహకార సంఘం ద్వారా రైతులకు విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

• వైద్య సేవలపై ఆరా

మంచిర్యాలటౌన్: మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను సోమవారం బీజేపీ నాయకులు అడిగి తెలుసుకున్నారు. పట్టణ అధ్యక్షుడు అమిరిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని వార్డులను సందర్శించి, వైద్యులు సమయానికి వస్తున్నారా, సరైన చికిత్స అందిస్తున్నారా అని ఆరా తీశారు. కరీంనగర్, హైదరాబాద్‌కు రెఫర్ చేస్తున్నారని, ఆసుపత్రిలో పరిశుభ్రతను పాటించడం లేదని, మరుగుదొడ్లు దుర్వాసన వస్తున్నాయని ఈ సందర్భంగా రాజు తెలిపారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందునా పరిశుభ్రతను పాటించేలా చూడాలని కోరారు. తాగునీటి సౌకర్యంను రోగులకు ఏర్పాటు చేయాలని కోరారు.

• బెల్లి లలిత వర్ధంతి

పాతమంచిర్యాల: రాష్ట్రం కోసం జీవితం అర్పించిన సామాజిక విప్లవకారిణి, గానకోకిల బెల్లి లలిత అని తెలంగాణ స్టేట్ ప్రైవేట్ బస్ డ్రైవర్, క్లీనర్స్ యూనియన్ అధ్యక్షుడు టి జైపాల్ సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ముఖరాం చౌరస్తా వద్ద సోమవారం బెల్లి లలిత వర్ధంతిని నిర్వహించారు. నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ప్రైవేట్ బస్ డ్రైవర్, క్లీనర్స్ యూనియన్ నాయకులు జాడి చంద్రయ్య, శ్రీనివాస్, శేఖర్, సంతోష్, పోచన్న పాల్గొన్నారు.

వేమనపల్లి తహసీల్దార్‌గా సంధ్యారాణి

వేమనపల్లి: వేమనపల్లి తహసీల్దార్‌గా సంధ్యారాణి సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన రమేశ్ ఇటీవల బదిలీపై వెళ్లగా ఇన్‌చార్జిగా డీటీ పోశన్న కొనసాగారు. సంధ్యారాణి దండేపల్లి మండలం నుంచి బదిలీపై వచ్చారు.

సరస్వతీ పుష్కరాలకు 3వేల మంది

మంచిర్యాలటౌన్: నియోజకవర్గంలోని 3వేల మందిని 65బస్సుల్లో స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సుల్లో పంపించారు. సరస్వతీ పుష్కరాల చివరి రోజు కావడంతో, పుష్కర స్నానాలు చేయని వారికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

• సద్వినియోగం చేసుకోవాలి

భీమిని: గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని భీమిని ఎంపీడీవో గంగమోహన్, కన్నెపల్లి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం ప్రజావాణిలో భాగంగా హాజరు కాగా ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు.